ప్రజాశక్తి

గురువారం 6 మార్చి 2025 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

సంక్షేమ హాస్టళ్లలో
తాగునీటి వెతలు తీరినట్లేనా.?

- ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి స్వామి ప్రకటన
- మరమ్మతులకు ప్రతి హాస్టల్‌కు రూ.10 లక్షలు ఇస్తున్నట్లు వెల్లడి
- ఇప్పటికీ 40 శాతం ప్రైవేటు భవనాల్లోనే హాస్టళ్ల నిర్వహణ



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు లేక పేద విద్యార్థులు పడే పాట్లు చెప్పేవి కావు. హాస్టల్ అనగానే రేషన్ బియ్యంతో ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, నాసిరకం కూరలు.. చాలీచాలనట్లుగా తిండి ఉంటుం దన్నది వాస్తవం. విద్యార్థులు నిత్యం హాస్టళ్లలో సౌకర్యాలు లేవంటూ ఆందో ళనలూ చేస్తుంటారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లలో బీపీటి బియ్యంతో అన్నం పెట్టాలనే ఆలోచన చేస్తోంది. ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇదే జరిగితే పిల్లల ఆరోగ్యం చాలా వరకూ ▶ 2లో



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

ఇది దగాకోరు పరిపాలన

కలెక్టరేట్ వద్ద ధర్నా ▲ 8లో

సంక్షేమ హాస్టళ్లలో తాగునీటి వెతలు తీరినట్లేనా.?

(మొదటి పేజీ తరువాయి)

బాగుపడుతుంది. తాజాగా సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా(శ్రీబాలవీరాంజనేయస్వామి చేసిన ప్రకటన హాస్టల్ విద్యార్థులకు తాగునీటి వెతలు తీర్చేలా ఉంది. సంక్షేమ హాస్టళ్లలో ఆర్ఓ ప్లాంట్లు పెడుతున్నట్లు అసెంబ్లీలో బుధవారం నాడు వెల్లడించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లన్నింటిలో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది మంచి నిర్ణయమే.. ఎందుకంటే హాస్టళ్లలో చదివే విద్యార్థులకు సరైన తాగునీరు లేదు. బోర్లు వేసి వాటిల్లోని ఫ్లోరిన్ నీరే ఇస్తున్నారు. తాగడానికి, బాతురూములకు అన్నీ బోర్లలో నీళ్లే. వాటితోనే దుస్తులు కూడా ఉతుక్కుంటున్నారు. ఏ హాస్టల్‌కు వెళ్లినా నీటి సమస్యలే తీవ్రంగా ఉంటాయి. భవనాలు సరిగా లేక పెచ్చులు ఊడిపడటం కూడా ఉన్నాయి. అనేకచోట్ల నిర్మాణ లోపాలతో పదేళ్లకే దెబ్బతిన్న భవనాలూ కనిపిస్తాయి. మంత్రి ప్రకటనతో విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఇక మరమ్మతులకూ రూ.పది లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పటికీ 40శాతం హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలు లేవు. ప్రవేటు భవనాలు అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. అంటే చాలీచాలని ఇరుకుభవనాల్లోనే గడుపుతున్నారు. జిల్లాలో సాంఘీక సంక్షేమ శాఖ పరిధిలో 81 హాస్టళ్లు ఉండగా 6 వేల మంది వరకూ విద్యార్థులున్నారు. ఇందులో 45 హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలుండగా 36 హాస్టళ్లు ప్రవేటు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. బీసీ హాస్టళ్లు 66 ఉన్నాయి. వీటిలో 27 ప్రభుత్వ భవనాలుకాగా 23 చోట్ల అద్దెభవనాలే దిక్కయ్యాయి. ఈ హాస్టళ్లలో 5 వేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. గిరిజన హాస్టళ్లు 29 ఉండగా 24 ప్రభుత్వ భవనాలుండగా 5 ప్రవేటు భవనాల్లో సాగుతున్నాయి.హాస్టళ్లకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అక్కడే అన్ని వసతులూ కల్పించాలి. అప్పుడే విద్యార్థుల చదువులు సజావుగా సాగుతాయి. ఇక ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసినా నీటి లభ్యత సక్రమంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే పశ్చిమాన బోర్లు వేసవి ఎండిపోతాయి. ప్రత్యామ్నాయాలపైనా ఆరంభంలోనే దృష్టిసారించి వాటిని ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

వైసిపి హయాంలో గురుకులాల్ని నిర్లక్ష్యం చేశారు: మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

వైసీపి హయాంలో గురుకులాల్ని నిర్లక్ష్యం చేశారని బుధవారం శాసనసభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గురుకుల పాఠశాలకు రూ.10 లక్షలు కేటాయించి మైనర్ రిపేర్లు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం గురుకులాల్లో సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, సైన్స్ కోర్సులు కూడా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గురుకులాల్లో విద్యనభ్యసించిన అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత హోదాల్లో ఉన్నారని తెలిపారు. మాథ్స్ ఒలంపియాడ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన కొండపి గురుకుల విద్యార్థి కీర్తికి అభినందనలు తెలిపారు. వైసిపి హయాంలో గురుకులాల్ని నిర్లక్ష్యం చేశారు. గురుకుల విద్యార్థులకు కార్పెట్స్, బెడ్ షీట్స్‌తో పాటు స్పోర్ట్స్ డ్రస్, నైట్ డ్రస్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందిస్తామని తెలిపారు. కార్పొరేట్ విద్యకు దీటుగా గురుకులాల్లో విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. గురుకులాల్లో 49 మంది విద్యార్థులు ఎంబిబిఎస్, 60 మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించారు. జేఈఈ మెయిన్స్‌లో 60 మంది విద్యార్థులు అర్హత సాధించారని అన్నారు. ప్రస్తుతం గురుకులాల ఐఐటి, నీట్ శిక్షణ కేంద్రాలు 3 ఉన్నాయని, వాటిని 10కి పెంచుతామని తెలిపారు. ఉన్నత విద్యా ప్రమాణాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థుల ఉన్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

'సమగ్ర శిక్ష' కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-శింగరాయకొండ



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసి ఆధ్వర్యంలో సమ్మె కాలంలో ఒప్పందం అమలు చేయాలని శింగరాయకొండ మండల విద్యా వనరుల కేంద్రం వద్ద బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలుకై కమిటీని ఏర్పాటు, మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ అమలు, ఇతర సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి. డిసెంబర్ 20, 2023 తేదీన సమ్మె ప్రారంభించాం. ప్రభుత్వంతో సమ్మె ఒప్పందాలు జరిగిన తర్వాత జనవరి 10, 2024 తేదీన సమ్మె విరమించాం. నేటి వరకు ఉద్యోగుల కీలకమైన అంశాలు హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ, మినిమం ఆఫ్ టైం స్కేల్, వేతనాలు పెంపు, ఈపీఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్ చార్ట్, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యూటీ అమలు ఇతర ముఖ్య విషయాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలూ లేవు. ఈ నేపథ్యంలో ఉద్యోగు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 5, 6 తేదీలు, బుధ, గురు వారాల్లో శింగరాయకొండ కేజీబీవీ స్కూల్స్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో సామూహిక నిరసన తెలియచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా 8వ తేదీన జిల్లా కేంద్రంలో మహిళా ఉద్యోగుల సమస్యలపై సదస్సు నిర్వహించి, తీర్మానం చేస్తున్నాం. మార్చి 11వ తేదీన విజయవాడ కేంద్రంలో నిరసన దీక్ష చేయలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కె శ్రీహరి, కూతల వంశీ, ప్రమీల లలితకుమారి, షేక్ ఆషా, సయ్యద్ సుల్తాన్ బాషా ఉన్నారు.

మహిళా కబడ్డీ పోటీలలో రైజ్ విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి-టంగుటూరు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ వారు బెక్టాగన్-2025, కార్యక్రమంలో కల్చరల్ క్రీడలు నిర్వహించారు. అందులో భాగంగా జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలలో 12 టీంలు పాల్గొన్నాయి. అందులో రైజ్ కృష్ణసాయి గ్రూపునకు చెందిన కబడ్డీ టీం విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాలల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు మాట్లాడుతూ కబడ్డీ క్రీడలలో విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో ఉండటం హర్షదాయకమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి ఉండటం వలన వారు మానసికంగా ఏంతో ఉత్సాహంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. 12 మంది సభ్యులతో కూడిన కబడ్డీ టీం మహిళా కబడ్డీ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచినందుకు వారిని రైజ్ రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నారు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్ హిమచంద్రబాబు, ఎన్ సుబ్బారావు, విద్యార్థులను అభినందించారు.

కనుల పండుగగా సీతారామ కల్యాణోత్సవం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీ ఆమలక లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో రోజైన బుధవారం నాడు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం కనుల పండువగా శాస్త్రయుక్తంగా నిర్వహించారు. మొదట ఉభయదారులను కమిటీ సభ్యులు డాక్టర్ డివి కృష్ణారెడ్డి, జి వెంకటరెడ్డి, యేర్వ సత్యనారాయణరెడ్డి, సి మల్లారెడ్డి, ఎస్ యోగిరెడ్డిలు మూలాధారణ గావించి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షణ, గోపూజ నిర్వహించారు. కళ్యాణం అనంతరం తీర్థగోష్టి గావించారు. అనంతరము తది ఆరాధన ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో జనం పాల్గొన్నారు.

సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ



నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

శింగరాయకొండ మండల కెవిపిఎస్ నాయకులు ప్రేమల బాబురావు తండ్రి ప్రేమల లక్ష్మయ్య(75) మంగళవారం మృతి చెందారు. బుధవారం శింగరాయకొండ మండలం కలికివాయి గ్రామంలోని వారి నివాసం వద్దకు సిపిఎం నాయకులు వచ్చి లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సిపిఎం నాయకులు కంకణాల ఆంజనేయులు, జి శ్రీనివాసులు, వీ బాలకోటయ్య, టంగుటూరి రాము, జీవీ కుమార్, అత్తోట సువర్ణరాజు, పడిదపు రవికుమార్, వల్లూరు రవి, దామతోటి శ్రీనివాసరావు, యర్రమల సుబ్బారావు తదితరులు హాజరయ్యారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ (జి.సి.డి.ఓ) కె హేమలత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉచిత విద్యుత్తుపై మంత్రి అసత్య ప్రకటన

చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం గత ఎనిమిది నెలలకు రూ. 250 కోట్లు ఖర్చు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత శాసన మండలిలో మంగళవారం ప్రకటించటం సరైనది కాదని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక చేనేత సహకార సంఘం మగ్గాల షెడ్ల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవంగా ఇంత వరకూ చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ జీవోను విడుదల చేయలేదని తెలిపారు. జీవో విడుదల చేయకుండా డబ్బులు ఎలా ఖర్చు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇది శాసనమండలిని తప్పుదోవ పట్టించటమేనని ఆయన ఆరోపించారు. చేనేత ముడి సరుకుల కొనుగోలుపై జిఎస్‌టి, రీయింబర్స్ మెంట్ కోసం కింద రూ.1,505 కోట్లు ఖర్చుపెట్టినట్లు మంత్రి తెలిపారన్నారు. అయితే ఇంత వరకూ ఒక రూపాయి కూడా విడిలించలేదన్నారు. ఇది పూర్తిగా ప్రజలను, ప్రజాప్రతినిధుల సభలను మంత్రి తప్పుదోవ పట్టించడమేనని సత్యనారాయణ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అంకెల గారడీలు, అబద్ధాలతో కాలం వెళ్లబుచ్చుతుందని విమర్శించారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో చేనేతకు కేవలం రూ.115.75 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. వాస్తవంగా చేనేత అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల అధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించలేదని.. యువతి పై దాడి..

ప్రజాశక్తి - చీరాల

ప్రేమించలేదని ఓ యువకుడు యువతిపై దాడి చేశాడు. ఈ ఘటన వేటపాలెం మండలం కటారిపాలెం సముద్ర తీరం వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం..వివరాలు మేరకు చీరాలలోని మూడు రోడ్ల సెంటర్‌లో నివాసం ఉంటున్న ఓ విద్యార్థిని చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది. చీరాల నల్లగాంధీ బొమ్మ సెంటర్ లో నివాసం ఉంటూ అదే కళాశాలలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న పూజిత్ అనే యువకుడు ప్రేమ పేరుతో గత కొంత కాలంగా ఆమె వేధిస్తున్నాడు. ఈ విషయంపై గతంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆ యువకుడి తీరులో మార్పురాలేదు. ఈ క్రమంలో మాయమాటలు చెప్పి నమ్మించి సముద్రతీరం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ యువతిపై దాడి చేశాడు. క్షతగాత్రురాలని స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా ఓ ప్రైవేట్ హస్పిటల్‌కు తరలించారు. యువతి తల్లి అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న

ముగ్గురు వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ భూషణం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్ మహ్మద్‌మోయిన్ మాట్లాడారు. దోప్పలపూడి యెహోషువ, బల్లాని పవన్ కుమార్, నీరు కంటి సురేష్ అనే వారు బూర్లవరపాలెం పంచాయతీ పరిధిలోని బండారు నాగేశ్వరావు కాలనీ సమీపంలో బ్యాగులతో అనుమానస్పదంగా తిరుగుతున్నట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకోగా నిందితులు బ్యాగు, స్కూటీని అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నం చినట్లు తెలిపారు. అయినప్పటికీ పోలీసులు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద మూడు కిలో 900 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, రూ.2000 నగదు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

'సెయింట్ ఆన్స్' విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జట్టు ఎస్ఎఆర్ఎం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కళాశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు బుధవారం తెలిపారు. గుంటూరులోని ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇటీవల జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ మిలన్- 2025 సందర్భంగా వాలీబాల్ పోటీల్లో నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 24 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. ఫైనల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు, నర్సాపూర్‌లోని స్వర్ణ ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలపై విజయం సాధించి రూ.30,000 నగదు బహుమతిని అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.జగదీష్ బాబు తెలిపారు. విజేతలు విజేతలను కళాశాల వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి.రమణమూర్తి, సి. సుబ్బారావు అభినందించారు.

ప్రభల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : సిఐ

పజాశక్తి- అద్దంకి

సింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే వారు పోలీస్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని సిఐ ఏ.సుబ్బరాజు తెలిపారు. పది మంది తక్కువ కాకుండా విద్యుత్ ప్రభల నిర్వాహకులు కమిటీగా ఏర్పడాల్లన్నారు. పోలీస్ నిబంధనలు పాటించాలన్నారు. తిరునాళ్లలో అసభ్యకర మాటలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈనెల 6లోపు విద్యుత్ ప్రభల నిర్వాహకులు పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు.

పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలి : ఎడిఎ



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పర్చూరు

శనగ పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలని ఎడిఎ తెలిపారు. మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం, తన్నీరువారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో వచ్చు కత్తెర పురుగుల నివారణకు రైతులు చర్యలు చేపట్టాలన్నారు. కత్తెర పురుగు నివారణకు వేసవిలో దుక్కులు దున్నారు. విత్తన శుద్ధి చేయాలన్నారు. పంట చుట్టూ ఎరపంటగా నేపియర్ గడ్డిని నాలుగు వరుసలు సాగు చేయాలన్నారు. పురుగు గుడ్డు దశలో ఉన్నప్పుడు వేపాగింజల కసాయాన్ని పిచికారీ చేయాలన్నారు. శనగ పంటకు బదులుగా జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలు సాగు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సొంత భూమి కలిగిన రైతులు ఆధార్, పట్టాదారు బుక్ జెరాక్ కాపీ, ఆధార్‌కు లింకైన మొబైల్ నంబరు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్స్ ఐడి పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రామ్మోహన్‌రెడ్డి,వివిఎలు హేమావర్ధినిలావణ్య, పాల్గొన్నారు.

అద్దంకి : వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పంటలు సాగు చయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చునని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులకు రాయితీ పై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పంట వ్యర్ధాలను కాల్చకుండా భూమిలో కలియ దున్నాలన్నారు. తద్వారా భూమిలో కర్బన శాతం పెరుగుతుందన్నారు. ఫలితంగా భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వీరేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు కోటేశ్వరరావు, రేణుక, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల పరిధిలోని సూరవరపుపల్లి, అనంతవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మేరిమ్మ మాట్లాడుతూ రైతులు వేసవి కాలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసారా పరీక్షలు వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. భూసార పరీక్షలు వల్ల భూమిని నత్రజని, భాస్వరం, పోటాషియం, షిఫార్సును బట్టి ఎరువులను వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ మధు ప్రియ, రైతులు మదమంచి వీరయ్య, కోటేశ్వరరావు, అంకమ్మరావు, విమల కుమారి, సతీష్, నర్రా చంద్రశేఖర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు : పంట మార్పిడితో పంటలకు వచ్చే తెగుళ్లను నివారించుకోవచ్చని ఎఒ సుధీర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని దగ్గుబాడు, నాయుడువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదుకు చేయించుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. శనగ పంటకు బదులుగా జొన్న, మొక్కజొన్న, సజ్జ సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు కిషోర్ రైతులు పాల్గొన్నారు..

గ్రానైట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాద వశాత్తు ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మార్టూరులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సైదా కథనం ప్రకారం... మార్టూరులోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో మధ్యప్రదేశ్ రాష్ట్రం, సిద్ది జిల్లా, తాంశార్ గ్రామానికి చెందిన సంపత్ కుమార్ యాదవ్ (25) గత మూడు నెలలుగా షిఫ్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గ్రానైట్ రాయిని కట్ చేసే సమయంలో ముక్క మీద పడుతుందని తప్పించుకోవడానికి వెనక్కి జరుగుతూ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడి కక్కడే మతి చెందాడు. సమాచారం అందుకున్న సిఐ మాదినేని శేషగిరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో మతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.



బైకులు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన దర్శి-అద్దంకి రహదారిలో ఉల్లగల్లు వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పొదిలి మండలం గురవాయపాలెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ చెన్నయ్య(50), శివకోటిరెడ్డి బైకుపై దర్శి వెళుతున్నారు. అదే సమయంలో ఉల్లగల్లు గ్రామానికి చెందిన జిల్లెల్లముడి సురేష్ బైకుపై వస్తున్నాడు. ఘటనా స్థలం వద్ద బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో చెన్నయ్య, సురేష్, శివకోటిరెడ్డి గాయపడ్డారు.క్షతగ్రాతులను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చెన్నయ్య మృతిచెందాడు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న టిప్పర్

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - పర్చూరు

ఆర్‌టిసి బస్సును గ్రావెల్ లోడ్‌ను వెళ్తున్న టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పర్చూరు సమీపంలోని పిడుగురాళ్ళ,వాడరేవు రోడ్డులో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది.ఎస్ఐ మాల్యాద్రి కథనం ప్రకారం... చీరాల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు చిలకలూరిపేట వెళ్తుంది. హైవే రోడ్డు పనుల కోసం గ్రావెల్ తోలుతున్న టిప్పర్ రాంగ్ రూట్లో వచ్చి బస్సును ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ సహా ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగ్రాతులను పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు వెంబడి నిలబడిన వ్యక్తిని బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన స్థానిక ఎలకచెట్టు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన గురిజేపల్లి గ్రామానికి చెందిన వెన్నా వెంకటేశ్వరరెడ్డి(40) మృతి చెందాడు. మృతుడు బైకుపై యర్రగొండపాలెం వసుండగా ఫోన్ వచ్చింది. బైకును రోడ్డు ప్రక్కన నిలిపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో బైకు వస్తున్న వ్యక్తి వెనుక నుంచి వెంకటేశ్వర్‌రెడ్డిని ఢీకొన్నాడు. దీంతో వెంకటేశ్వరరెడ్డికి కాలు విరిగింది. తీవ్ర గాయాలయ్యాయి. క్షగాత్రుడిని 108 వాహనంలో యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య

ప్రజాశక్తి - పంగులూరు

నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై సర్వే నిర్వహించి, వాటి పరిష్కారం కోసం ఉద్యమించేందుకు ఈనెల 8 నుంచి 28 వరకూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నట్లు సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య తెలిపారు. పంగులూరులో సిపిఎం మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం గంగయ్య మాట్లాడుతూ గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఆ సమస్యలతో ప్రజలు సతమత మవుతున్నట్లు తెలిపారు. ఆ సమస్యల పరిష్కారంతోపాటు, ఎన్నికల హామీగా అధికార పార్టీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల అమలు కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం, పోరాటం నిర్వహించనున్నట్లు తెలిపారు. తాగునీరు, బెల్ట్ షాపులు, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ, దోమలు, ఉపాధి పనులు, వీధిలైట్లు, మైక్రో ఫైనాన్స్, పంటలకు గిట్టుబాటు ధరలు, నల్లబర్లీ పొగాకు కొనుగోలు తదితర సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. తమ పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి ఆయా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్


మాట్లాడుతున్న బాపట్ల జిల్లా సిపిఎం కార్యదర్శి గంగయ్య

పథకాలను అమలు చేయకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డిఎస్‌సి నిర్వహిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇంతవరకూ డిఎస్‌సిని నిర్వహించలేదని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3 వేలు, మహిళలకు నెలకు రూ.1,500 తదితర పథకాలు ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామని ఆయన తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బర్లీ పొగాకుపై ఆశతో కౌలు రైతులు భారీగా సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ధరలు తగ్గినట్లు తెలిపారు. నల్లబర్లీ కొనుగోలు చేస్తారో లేదో తెలియని పరిస్థితి ఉందన్నారు. బర్లీ పొగాకును కూడా బోర్డులో చేర్చి రైతుల దగ్గర ఉన్న పొగాకు మొత్తాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు పెట్టే ఇబ్బందులతో పేదలు అల్లాడిపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ కంపెనీలను కట్టడి చేసి పేదలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, మండల కమిటీ సభ్యులు మానం హరిబాబు, పూనపాటి సుబ్బరాజు, పి. ఏలియా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జివి. శ్రీదేవి

ఆదర్శవంతమైన జీవనానికి కృషి

ప్రజాశక్తి-బాపట్ల

గ్రామాల్లోని బాలికలు, మహిళలు ఆదర్శవంతమైన జీవనానికి అవసరమైన ప్రణాళికల ద్వారా గ్రామ పంచాయతీలు కృషి చేయాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ సంయుక్త సంచాలకులు జివి. శ్రీదేవి అన్నారు. బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రంలో మహిళా సర్పంచులు కార్యదర్శులకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 26 జిల్లాలకు చెందిన 26 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఈ శిక్షణా తరగుతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి బాలికలు మహిళా సంరక్షణ పై గ్రామ పంచాయతీ పాత్ర అనే అంశంపై మాట్లాడారు. లింగ ఆధారిత హింసను పరిష్కరించడం, లింగ నిర్ధారణను నిరోధించడంలో గ్రామపంచాయతీ ప్రధాన భూమిక నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలన, మహిళా గ్రామసభ నిర్వహణ ఏర్పాటునకు అవసరమైన కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలోఇటిసి ప్రిన్సిపల్ డి .వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ ఆర్.కేశవరెడ్డి , డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ అనంతరాజు

8 నుంచి గ్రామాల్లో పి4 సర్వే

ప్రజాశక్తి - పంగులూరు

పేదలను గుర్తించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పి4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమంలో భాగంగా ఈనెల 8 నుంచి 18 వరకూ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ, మండల ప్రత్యేక అధికారి అనంతరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పి 4 కార్యక్రమంపై ఎంపిడిఒ స్వరూప రాణి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ:గా అనంతరాజు మాట్లాడుతూ సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. సర్వేలో ధనవంతులు ఎవరు, పేదలు ఎవరు అనేదానిపై స్పష్టమైన అవగాహనకు రావాలన్నారు. నిజమైన పేదలను గుర్తించి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే పి4 సర్వే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ స్వరూపరాణి, తహశీల్దారు సింగారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ బాల రాజేశ్వరి, ఇఒఆర్‌డి కె. సుమంత్, పంచాయతీరాజ్ ఎఇ హనుమంతరావు, హౌసింగ్ ఎఒ కిషోర్ కుమార్, ఎంఇఒ వీరాంజనేయులు, ఎపిఒ సంతోషం, సిసి సాల్మన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివయ్య, అంగన్‌వాడీ సూపర్ వైజర్ పద్మజ, పంచాయతీ సెక్రటరీలు ,సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొల్లూరు

మండల పరిధిలోని పెసర్లంక గ్రామానికి చెందిన జొన్నకూటి గోపాలకష్ణ, రత్నకుమారి దంపతుల కుమారుడు హేమగోపి , లీలా సౌమిత్రి రిసెప్షన్ వేడుకలు స్థానిక కల్యాణ మండలంలో బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రభుత్వాలు మారినా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం లేదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు ప్రశాంతికి రైతు సంఘం ఆధ్వరంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం రామకోటేశ్వరరావు అయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగినట్లు తెలిపారు. దీంతో రైతులు అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అందుకు పరిష్కారం స్వామినాథన్ కమిటీ నివేదిక ప్రకారం.. రైతులు పండించిన పంటలకు ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం ధర పెంచి ప్రభుత్వమే రైతులు వద్ద కొనుగోలు చేసేలా చట్టబద్ధం చేయాలన్నారు. ఓ పంటకు ఇచ్చిన అప్పులు రద్దు చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల పాలైన రైతులను ఆడుకోవటానికి రైతుల అప్పులను వెంటనే రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, రైతు సంఘం నాయకులు గోనుగుంట్ల మోహన్ రావు, గాడిపర్తి శివ నాగేశ్వరరావు,కె. శ్రీనివాసరావు, బొడెంపూడి సూరిబాబు, కె.. రామాంజనేయులు పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు


పరీక్ష సామగ్రి అందజేస్తున్న దాతలు

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలులోని తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కార్తీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పరీక్ష సామగ్రి అందజేశారు. పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ నండూరి కార్తీక్ చేతుల మీదుగా ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ దాతల సహకారంతో సమకూర్చుకొని అందించిన ఈ పరీక్షా సామగ్రిని విద్యార్థులు వినియోగించుకునిఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ కోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు, ఉపాధ్యాయులుశ్రీనివాసరావు, మొహమ్మద్ అనుల్ హాక్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

'నల్లబర్లీ' కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

తహశీల్దారుకు రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - పంగులూరు

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి, తక్షణమే పొగాకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తహశీల్దారు పి.సింగారావును బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయని వినోద్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు బర్లీ పొగాకును పెద్దమొత్తంగాలో సాగుచేసినట్లు తెలిపారు. అందులో నల్లబర్లీ పొగాకును కూడా ఎక్కువగా సాగు చేశారని తెలిపారు. నల్లబర్లీ పొగాకును కంపెనీలు ఇంత వరకూ కొనుగోలు చేయలేదని తెలిపారు. రైతుల ఇళ్ల వద్దే పొగాకు చెక్కులు మగ్గుతున్నాయని తెలిపారు. కంపెనీలు అసలు కొంటాయా? లేదా అనేది అనుమానంగా ఉందన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన


తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పొగాకును కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రంగంలోకి దిగి పొగాకును తక్కువ ధరకు ఇవ్వాలని రైతులను అడుగుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నల్లబర్లీ పొగాకును కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. శనగ, మిర్చి, మొక్కజొన్న, కంది, వంటి పంటలకు కూడా గిట్టుబాటు ధరలు లేవని తెలిపారు. గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఎర్ర శనగలు కింట్వా రూ.7 వేలకు, కాక్-2 రకం శనగలు క్వింటా రూ. 10 వేలకు కొనుగోలు చేయాలన్నారు. మిర్చిని క్వింటా రూ.20 వేల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని విరమించు కోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. పాడి రైతులకు లీటరు రూ.5 వంతున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రైతులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు మానం హరిబాబు, తానికొండ సుధాకర్‌రావు, నందవరపు జాన్‌సాహెబ్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవేంద్ర

ముగిసిన కెవిపిఎస్ రాష్ట్ర వర్క్‌షాప్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలులో రెండు రోజుల పాటు నిర్వహించిన కెవిపిఎస్ రాష్ట్ర వర్క్ షాప్ బుధవారంతో ముగిసింది. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప అధ్యక్షతన వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఛైర్మెన్ దేవేంద్ర మాట్లాడుతూ ఏప్రిల్ 11 నుండి సామాజిక సమస్యల మీద ప్రజలను చైతన్యం చేస్తూ కులవివక్షత, అంటరానితనం రూపుమాపేందుకు కలిసి వచ్చే ప్రజాతంత్ర వాదులతో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బహుజన సాంస్కృతిక ఉత్సవాలు కర్నూలు జిల్లాలో ప్రారంభమై రాష్ట్రంలోని 26 జిల్లాల గుండా విజయవాడ నగరంలో మే నెల ఆఖరు ముగింపు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల జయప్రదం చేయడానికి అన్ని సామాజిక తరగతులకు చెందిన ఉద్యోగ,కార్మిక,ప్రజాతంత్ర వాదులు సహకరించాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ కోరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు బి రఘురామ్, ఎండి ఆనంద్ బాబు, జి చిరంజీవి, క్రాంతి బాబు, నటరాజ్, రంగమ్మ, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా దామచర్ల సత్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య జన్మదిన వేడుకలు బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. దామచర్ల సత్య శింగరాయకొండ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కందుకూరు రోడ్డు వద్ద నందమూరి తారకరామారావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాల వేసి.. నివాళు లర్పించారు. దామచర్ల సత్య పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేల్పుల సింగయ్య చీమకుర్తి



శింగరాయకొండలో సత్యను సత్కరిస్తున్న నేతలు



బింగినపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న నేతలు

కష్ణ, మించల బ్రహ్మయ్య, కోనపురెడ్డి వెంకటసుబ్బారావు బాయిరెడ్డి మురళి, సుదర్శి ప్రసాదరావు ఇమ్మడిశెట్టి రామారావు శీలం సుబ్రహ్మణ్యం, నర్రా రాంబాబు ఉన్నారు. అదేవిధంగా శింగరాయకొండ మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఒంగోలులోని క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన దామచర్ల సత్య జన్మదిన వేడుకలకు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. బింగినపల్లి గ్రామంలోని సన్నెబోయిన మాలకొండయ్య పూడి రోసిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలోని మహిళలకు దామచర్ల సత్య పుట్టినరోజు సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కొండపి: దామచర్ల సత్యకు కొండపి తెలుగుదేశం పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సత్యను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ జి రామయ్య చౌదరి, భక్తుల నారాయణస్వామి, నర్సారెడ్డి, వసంతరావు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కొండపిలో శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

సమాన హక్కుల కోసం ఉద్యమించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు నేటికీ సమాన హక్కులు పొందలేకపోతున్నారని, సమాన హక్కుల సాధనకు సమైక్యంగా ఉద్యమాలు చేయడం ద్వారానే వాటిని సాధించుకోగలరని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఐద్వా ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య నగర్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా మహిళలు వివక్షతకు గురవుతున్నారని, మహిళలపై నిత్యం దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరగటం బాధాకరమని అన్నారు. ఐద్వా నాయకురాలు డి. మధురవాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, ఐద్వా నాయకులు కే.రాజేశ్వరి, ఎస్.అనిత, డి.తిరుపతమ్మ, పి.సామ్రాజ్యం, పి.పద్మ, పి.సంతానం, పి.నాగమ్మ, ఏ .అనిత కుమారి, సిహెచ్.నరసమ్మ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మహిళా దినోత్సవాన్ని నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో ఒక కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆశించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేసి మంజూరు పత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. బాపట్ల జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ, సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కుర్చీలాటలో పాల్గొన్న మహిళలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఎపి ఎన్జీవో అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక ఎన్జీవో హోంలో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలను ఆయుష్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ పద్మజాతి జెండా ఊపి ప్రారంభించారు. మహిళా ఉద్యోగులకు లెమన్ - స్పూన్, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆటలపోటీలను ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షులు కె.శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి కష్ణారెడ్డి పర్యవేక్షించారు. ప్రకాశం జిల్లా మహిళా ఉద్యోగుల జిల్లా చైర్‌పర్సన్ కోటేశ్వరమ్మ, కన్వీనర్ శిరీష ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు శివకుమార్, ఏడుకొండలు, ప్రసన్న, రామాంజనేయులు, విజయ్, రవితేజ, కరిముల్లా పాల్గొన్నారు.

స్టాలిన్ స్ఫూర్తితో

ప్రజా ఉద్యమాలను నిర్మిద్దాం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఫాసిజాన్ని మట్టి కరిపించిన ఉక్కు మనిషి స్టాలిన్ స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిద్దామని ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్‌రావు తెలిపారు. వినీలాకాశంలో అరుణతార స్టాలిన్ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఒంగోలులోని మంచి పుస్తకం షాపు వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తొలుత స్టాలిన్ చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కె.నరసింహం, సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, కెఎన్‌పిఎస్ జిల్లా కార్యదర్శి ఎం జార్జి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఐ ఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, సీనియర్ కమ్యూనిస్టు లింగా వెంకటేశ్వర్లు, బిసి సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు కుళాయిలు తొలగింపు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగర పాలక సంస్థలో ఆస్తి పన్ను, మంచినీటి కుళాయి పన్ను మొండి బకాయిల వసూళ్లలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో మంచినీటి కుళాయిలు తొలగించినట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రాజీవ్ నగర్, బిబి టవర్స్, ఏఎన్ఆర్ అపార్ట్‌మెంట్, సంతపేట, శ్రీరామ్ స్కూల్, ఆర్కిడ్ స్కూల్, విఐపి రోడ్డు, చైతన్య టవర్స్, రాజాపానగల్ రోడ్డు, సుజాతనగర్ 2, 8వ లైన్లలో మంచినీటి కుళాయిలు తొలగించినట్లు పేర్కొన్నారు.

75 కిలోల ప్లాస్టిక్ కవర్లు సీజ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం నేపథ్యంలో ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు అధికారులు గురువారం కూడా పలు ప్రాంతాల్లో హోటళ్లు, ఇతర దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో 75 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. దుకాణాదారులు, హోటళ్ల యజమానులకు రూ.22,700 జరిమానా విధించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆడిటోరియం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని నెల్లూరు బస్టాండ్ వద్ద అంబేద్కర్ ఆడిటోరియం, స్టడీ సర్కిల్ నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వాలని ఏపి గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మల్లికార్జున్ నాయక్‌కు ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరావతిలోని ఆయన కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీని మర్యాదపూర్వకంగా కలిసిన బిళ్ళా చెన్నయ్య వినతిపత్రం అందజేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ రిలీఫ్ ఫండ్, జిల్లాకు పేరుకుపోయిన పాత బకాయిలన్నీ త్వరగా విడుదల చేయాలని కోరారు.

మార్కెట్లోకి 'టొయోటా కిర్లోస్కర్' లెజెండర్ కారు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సరికొత్త మాన్యువల్ ట్రాన్స్ మిషన్ గ్రేఢ్‌లో లెజెండర్ కారును టొయోటా కిర్లోస్కర్ మోటర్ మార్కెట్‌కి పరిచయం చేసింది. సేల్స్-సర్వీస్ - యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా మాట్లాడుతూ 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఖచ్చితత్వాన్ని పెంచుతుందని, టొయోటా అధునాతన టెక్నాలజీ డ్రైవర్లకు విభిన్న ఆఫ్-రోడ్ ఎస్కేప్లకు ఆదర్శవంతమైన సహచరుడిగా చేస్తుందన్నారు. వినియోగదారులు తమ సమీప టొయోటా డీలర్‌షిప్‌ను సందర్శించవచ్చన్నారు.

సమర్ధవంతంగా ఆధార్ కార్డుల నవీకరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ బాపట్ల జిల్లాలో సమర్ధంగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో జరిగింది. ఆధార్ కార్డుల నవీకరణ పెండింగ్ ప్రక్రియపై అధికారులు దష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఆధార్ కార్డుల నమోదులో బాపట్ల జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. బాపట్లకు 23 ఆధార్ కేంద్రాలు నూతనంగా మంజూరయ్యాయని సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉదయ్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ కె దామోదర్, జిఎస్ డబ్ల్యూ ఎస్ ఇంచార్జ్ విజయలక్ష్మి, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ బాబు, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్ పాల్గొన్నారు.

5,363 టైలరింగ్ యూనిట్లు మంజూరు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బీసీ సంక్షేమ సేవా సహకార సంస్థ ద్వారా మహిళలకు టైలరింగ్ యూనిట్లు ప్రకాశం జిల్లాకు 5363, బాపట్లకు 3564 యూనిట్లు మంజూరు చేస్తూ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఏ మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చినట్లు బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరావు బుధవారం నాడు తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళ సాధికారత చేకూర్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళల స్వయం సమద్ధి గావించే దిశగా చేపట్టిన ఈ టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మార్చి 8 మహిళా దినోత్సవం నాడు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాకు మంజూరయిని యూనిట్లకు సంబంధించి తరగతుల వారీగా బిసిలకు 1365, ఈబీసీలకు 300, కమ్మ 1385, రెడ్డి 1500, కాపు 257, వైశ్య 406, బ్రాహ్మణ 118, క్షత్రియ 32 ఆర్థికంగా వెనుకబడిన వారికి మొత్తం 3998 యూనిట్లు మంజరయ్యాయని బీసీలతో కలిపి మొత్తం జిల్లాకు 5363 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి బీసీ 982, కమ్మ 921, రెడ్డి 873, కాపు 257, ఈ బీసీ 235, వైశ్య 218, బ్రాహ్మణ 61, క్షత్రియ 17 మొత్తం ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 2582 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-పామూరు

హత్య కేసులో ఐదుగురు నిందితులకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ ఒంగోలు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.రాములు తీర్పు ఇచ్చారు. పామూరుకు చెందిన టెంట్‌హౌస్ యజమాని షేక్ ఖాసింపీరా అతని కుమారుడు మహబూబ్ బాషాలపై నిందితులు మజున్న నయబా, మజున్నా రసూల్, మజున్నా బాబు, మజున్నా ఖాజా, మజున్నా మస్తాన్‌లు ఎనిమిదేళ్ల క్రితం కత్తి, క్రికెట్ బ్యాట్‌లతో దాడి చేశారు. ఈ దాడిలో ఖాసిపీరా మృతి చెందాడు. అప్పటి పామూరు ఎస్సై సాంబశివరావు కేసు నమోదు చేయగా సీఐ రాజేష్ కుమార్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. నిందితులపై నేరం నిరూపణ అయినందున ఒంగోలు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.రాములు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష మరియు ఒక్కొక్కరికి రూ.7,500/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసులో సరైన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టి సమర్ధవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితులను శిక్షించబడటంలో క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి పామూరు సీఐ రాజేష్ కుమార్, పామూరు ఎస్సై వి.సాంబ శివరావు, కోర్టు కానిస్టేబుల్స్ నారాయణలను ప్రకాశం జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పొదిలి

పశువుల్లో గాలికుంటు వ్యాధి పట్ల పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని ఉన్న గురువాయపాలెం పశువైద్యాధికారి మంచి కల మణి శేఖర్ సూచించారు. జాతీయ పశు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వైద్యశాల ఆవరణలో గాలికుంటు వ్యాధి సోకిన పశు వులకు టీకాలు వేయించే సందర్భంగా పశు పోషకు లకు అవగాహన కల్పించారు. పశువులు తీవ్రమైన జ్వర ము, నీరసము, నోటి నుండి తీగల మాదిరి సొంగ రావ డం, నోరు మరియు కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, కొద్దిపాటి ఎండకే రొప్పడం, చూడి పశువులు ఈసుకు పోవడం జరుగుతుందన్నారు.

మెడికల్ కాలేజీపై సీఎం ప్రకటన చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మార్కాపురంలో ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యఓతన జరిగిన సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్ మాట్లాడుతూ మార్కాపురానికి కేటాయించిన మెడికల్ కాలేజీ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయిందని, నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాలేజీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్వీకెపి కాలేజీకి ఎయిడ్ రద్దు చేసిన కారణంగా ఈ ప్రాంత విద్యార్థులు పై చదువులు కొనుక్కోవలసిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. జిల్లాలో అత్యధిక మంది బాలికలు చదువుతున్న ప్రభుత్వ హై స్కూల్ మార్కాపురంలో వుందని, బాలికలకు బీసీ హాస్టల్ ఏర్పాటు చేయమని ఈ ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్నా పరిష్కారం కాలేదని, అక్కడ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన జిల్లాగా కేంద్ర ప్రభుత్వమే గుర్తించిందని, అందులోనూ ఇంకా వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రకాశం జిల్లాకు విద్యా వనరుల గురించి ముఖ్యమంత్రి మాట్లాడాలని ఎస్‌ఎఫ్‌ఐ ప్రకాశం జిల్లా కమిటీ కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ ఒంగోలు నగర కార్యదర్శి జి. ఆనంద్, నగర కమిటీ సభ్యులు దేవ, విజయ్ తదితరులు ఉన్నారు.




ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వినోద్

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమ్మె కాలపు ఒప్పం దాలను అమలు చేయాలని ప్రకాశం జిల్లా సమగ్ర శిక్ష కాం ట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం నాడు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కార్యా లయం వద్ద ఆ యూనియన్ నిరసన కార్యక్రమం చేపట్టింది. సమగ్ర శిక్షలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 2023 డిసెంబర్ 20 నుంచి 2024 జనవరి 10 వరకు సమ్మె నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ హామీ మేరకు సమ్మె విరమించిన సంగతిని గుర్తు చేశారు. సమ్మెకాలపు ఒప్పందాలలో వేతనాల పెంపు, పార్ట్ టైం పదం తొలగింపు, మినిమం టైమ్స్ స్కేల్ అమలు, ఈపీఎఫ్, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కారుణ్య నియమా నియామకాలు నిర్దిష్ట మైన జాబ్ చార్ట్ అమలు, కారుణ్య నియామకాలు, ఉద్యోగ విర మణ వయసు 62కు పెంపు, గ్రాడ్యూటీ అమలు వంటి సమస్య లు అపరిష్కృతంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కారం కోరుతూ మార్చి 5వ తేదీ మరియు మార్చి 6 న మండల కేంద్రాలలో, కేజీబీవీ పాఠశాలల వద్ద మ ధ్యాహ్న భోజన విరామ సమయంలో సామూహిక నిరసన తెలి యచేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ మహిళ దినోత్సవం సం దర్భంగా 8న జిల్లా కేంద్రంలో మహిళా ఉద్యోగుల సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించ కుంటే మార్చి 11వ తేదీన రాష్ట్ర కేంద్రం విజయవాడలో నిరసనదీక్ష చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్యాణి, జిల్లా కమిటీ మెంబర్లు వినయ్ శ్రీదేవి, కుమారి, వసంత, రాణి, వెంకటరత్నం, సజనరాణి, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న షహనాజ్, సర్దార్

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మద్దాల శ్రీనివాస్‌కు చిన్నప్పుడే పోలియో వచ్చి వికలాంగుడయ్యాడు. ఇటీవల తల్లిదండ్రులను పోగొట్టుకొని ఒంటరిగా మిగిలాడు. తన ఉపాధి కోసం సిమెంట్, కంకరకు సంబంధించిన సెంట్రింగ్ మెషిన్ సాయం చేయమని సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సయ్యద్ షహనాజ్‌ని అభ్యర్థించారు. స్పందించిన ట్రస్ట్ చైర్మన్ ప్రవాస భారతీయులు మండవ గీత మాధురి, మిత్రుల సహకారంతో ట్రస్టు కార్యాలయంలో సెంట్రింగ్ మెషిన్ నిమిత్తం రూ.1.15 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఎస్కే సర్దార్‌బాషా పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎంపిడిఓ ధారా హనుమంతరావు

ఆదరణ పథకంపై అవగాహన

ప్రజాశక్తి-తాళ్ళూరు

బిసిలు ఆదరణ పథకంపై అవగాహన కలిగి ఉండాలని తాళ్లూరు ఎంపిడిఓ ధారా హనుమంతరావు అన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో బీసీలకు ఆదరణ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ నుండి మహిళల కోసం అన్ని కులాల వారికి కుట్టు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సత్యం, బిసిలు పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలు వీరే..

ప్రజాశక్తి-పీసీపల్లి

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ జి.కోటయ్య తెలిపారు. వ్యాసరచన పోటీలో జి.అమూల్య, ఎం.లక్ష్మి, ఎం.నందిని వరుస స్థానాలు సాధించారు. డిబేట్ పోటీలో ఎల్.మాధురి, కళ్యాణి, చంద్రకళ పెయింటింగ్ పోటీలలో పి.హరిత, ఏ.రామకృష్ణ పి.దినేష్ విజేతలుగా నిలిచారు. వీరికి మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కనిగిరి ఎస్.డి.పి.ఓ సాయి ఈశ్వర్ యశ్వంత్, కనిగిరి సి.ఐ కనిగిరి ఖాజావలి అభినందనలు తెలిపినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

మంచి గ్రేడింగ్‌తో పొగాకు అమ్మాలి

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-పొదిలి

రైతులు మంచి గ్రేడింగ్‌తో పొగాకు అమ్మకాలు నిర్వహించుకోవాలని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.గిరిరాజు కుమార్ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పంట కాలానికి సంబంధించి ఈనెల 10వ తేదీన పొగాకు వేలం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మంచి గ్రేడింగ్ చేసుకొని మంచి కండిషన్‌తో పొగాకును వేలం కేంద్రాల్లోకి తీసుకురావాలని కోరారు. రైతులకు మంచి ధరలు లభించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ముందుగా వేలం కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వేలం ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్లను జాగ్రత్తగా చూసుకోవాలని మంచి బేల్స్ రైతులు తెచ్చుకునే విధంగా రైతులకు సమాచారం ఇవ్వాలని క్షేత్ర సిబ్బందికి సూచించారు. వేలం కేంద్రం ఆవరణంలోని వసతులను, రైతుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.


ఈడీ శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న రైతులు


శ్రీధర్‌బాబుకు సన్మానం

గత ఏడు సంవత్సరాల వనుంచి పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శ్రీధర్‌బాబును రైతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు రైతుల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు, గుంటూరు ప్రొడక్షన్ మేనేజర్ కె.వి రామాంజనేయులు, రైతు సంఘ నాయకులు దండే వీరనారాయణ, ఆవులూరి కోటేశ్వరరావు, రేగుల వీరాంజనేయులు, సిద్దవరం బ్రహ్మయ్య, చంద్రశేఖర్, పుట్లూరు వారి పాలెం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యకు మురళీకృష్ణ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పుట్టినరోజు సందర్భంగా బుధవారం కమ్మవారి సేవాసంఘం జిల్లా అధ్యక్షులు మండవ మురళీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.


దామచర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న మురళీకృష్ణ

డిగ్రీలోనే పిజి కోర్సులకు సిద్ధం కావాలి

ఏకేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సోమ శేఖర

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పీజీ కోర్సులకు డిగ్రీ చదువులప్పుడే విద్యార్థులు సంసిద్ధం కావాలని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సోమశేఖర అన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ డి.ఓ.ఏ విభాగం ఆద్వర్యంలో బుధవారం ఒంగోలు శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 'స్టూడెంట్ కెరీర్ గైడెన్స్ ఆన్ పీజీ కోర్సెస్ ఇన్ ఏ.కే.యూ' అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి యూనివర్శిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర అధ్యక్షత వహించి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అన్ని సెట్‌లకు నోటిఫికేషన్ జారీ చేస్తుందన్నారు. ఏకే యూనివర్శిటీలో 13 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటికి సంబంధించి ప్రవేశాల కోసం విద్యార్థులకు అవగాహన కల్పించారు. యూనివర్శిటీ ఏ.సి.ఈ డాక్టర్ అంచుల భారతీ దేవి మాట్లాడుతూ ఏ.పి.పీజీ సెట్ ఎంట్రన్స్ పరీక్షలను జూన్ 6 నుంచి 13 వరకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఎంట్రన్స్ జూన్ 25 న నిర్వహిస్తారని తెలిపారు. ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ర్యాంకుల ఆధారంగా ఎం.బి.ఏ విభాగంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంటు సహాయ ఆచార్యుడు డాక్టర్ జడ.అరుణ్ కుమార్ తెలిపారు. వివరాలకు కార్యాలయంలో కానీ 6304343448, 8978496178 నెంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ (సోషల్ వర్క్ విభాగం), డాక్టర్ ఈత ముక్కల (కెమిస్ట్రీ డిపార్టుమెంటు), కోలా సాయి బాబు (కంప్యూటర్స్ డిపార్టుమెంటు), శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.యోగయ్య చౌదరి పాల్గొన్నారు.త


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ సోమశేఖర

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో అమర్తలూరు ఐసిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇసిసిఇ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్తలూరు సిడిపిఒ విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్నారుల తల్లులకు పలు అంశాలపై సూచనలు చేశారు. చిన్నారులు ఏ వయసుకు ఎంత ఎత్తు , ఎంత బరువు ఉండాలి, ఎత్తుకు తగిన బరువు ఉన్నారో? లేదో? సరిచూసుకొని దానికి అనుగుణంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పోషణ వాటిక కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిడిపిఒ విజయరాణి, సూపర్ వైజర్ సంపూర్ణ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో మాట్లాడుతున్న సిడిపిఒ విజయలక్ష్మి



యద్దనపూడిలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

చుండూరు : చుండూరు మండలం మోదుకూరు సెక్టార్ పరిధిలోని మండూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఇసిసిఇ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగరాజకుమారి చిన్నారుల తల్లులకు వారి ఎత్తు బరువులు లకు తగిన విధంగా పుష్కహారాన్ని అందించాల్సిన అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నగంజాం : తల్లిదండ్రులు తమ పిల్లల పోషకాహారంపై దృషి సారించి వారి ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా ఆహారం అందించాలని సిడిపిఒ తిరుమల శెట్టి ఝాన్సీ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కడవకుదురు -4 అంగన్‌వాడీ కేంద్రంలో ఇసిసిఇ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలు యొక్క ఎదుగుదల వారి యొక్క పర్యవేక్షణ , ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిదండ్రుల ముందు పిల్లల యొక్క ఎత్తు బరువు కొలిచి వారి యొక్క పోషణ స్థితిని వివరించారు. ఇంటి వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల తల్లులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఉష, అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండల పరిధిలోని యనమదల గ్రామంలో ఇసిసిఇ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ పౌష్టికాహారం లోపం ఉన్న పిల్ల తల్లులకు పిల్లల పోషణపై అవగాహన కల్పించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బాల్య వివాహ రహిత భారత్ అనే నినాదంతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఅంగన్‌వాడీలు సుబ్బ లక్ష్మి,సౌభాగ్యం,శివ లక్ష్మి,ఆషా వర్కర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె : మహిళా శిశుసంక్షేమ అధికారి అదేశాలు మేరకు మహిళా దినోత్సవ వారోత్సవాలు లో భాగంగా బాపూజీ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారుల తల్లితండ్రులతో ఇసిసిఇ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఎం.సుచిత్ర మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు క్యారెట్లు, పండ్లు, కాయగూరలు తినే అలవాటును నేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తులు, బరువులు ప రీక్షించి, అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజ్ శివజ్యోతి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక శ్రీ శాతవాహన హైస్కూల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్చూరు ఎస్ఐ పోలా మాల్యాద్రి మాట్లాడుతూ మహిళా సాధికారత గురించి వివరించారు. ఆడపిల్లల విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. ఎలాంటి సంక్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనేలా ఎదగాలని వివరించారు. స్కూల్ కరస్పాండెంట్ తేళ్ల రాము మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని తెలిపారు. మొదటి మహిళా ఐపిఎస్ కిరణ్ బేడీని ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్‌బోస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం తెక్కించారు. 2024 మార్చి నుంచి ఈ ఏడాది మార్చి 5 వరకూ వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ఆదాయం రూ.1,31, 828 రూపాయలు వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్ స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఆలయ ఇఒ గుంటుపల్లి వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, లగ్గిశెట్టి అంజయ్య, అర్చకులు లక్ష్మీనారాయణ, అటెండర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రేపల్లె

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ శోభారాణి తెలిపారు. వెనుకబడిన తరగతులు సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని అర్హులైన మహిళలకు 90 రోజులపాటు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన బీసీ ,ఇడబ్ల్యుఎస్, ఈబీసీలకు సంబంధించిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రీయ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాలలోపు మహిళలు తమ సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతిరోజూ పత్రికలు చదవాలి

విశ్రాంత ఐఎఎస్ అధికారి డి. చక్రపాణి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

విద్యార్థులు ప్రతిరోజూ దినపత్రికలను చదవటం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని విశ్రాంత ఐఎఎస్ అధికారి డి. చక్రపాణి తెలిపారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు మరియు ఉఉపాధ్యాయులకు 10వ తరగతి పరీక్ష విధానంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యార్థులకు జ్ఞానం అందించాలి, ఎంతవరకు అందించాలి, దానికి తగ్గ జ్ఞానం ఉపాధ్యాయులుగా మనం ముందుగా ఏ విధంగా సాధించాలి అనే విషయాల గురించి వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ న్యూస్ పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. టెస్ట్ బుక్ విజ్ఞానంతో పాటు సాధారణ విజ్ఞానం కూడా మేధస్సు పెరగడానికిఉపయోగపడుతుందన్నారు. పదవ తరగతి తర్వాత ఏ రంగాలకు మంచి అవకాశాలు ఉన్నాయి. వారు ఏ రంగాన్ని ఎంచుకోవాలి. అందుకు ఏ విధమైన ప్రణాళిక రచించాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి స్కూల్ కరస్పాండట్ వెంకట్రావు , శ్రీధర్ మాస్టారు, డాక్టర్ పిసి. సాయి బాబు, విశ్రాంత రీడర్ ఇన్ కామర్స్ వెంకటేశ్వర్లు, విశ్రాంత పిజిటి మరియు హెచ్‌ఎం ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి చక్రపాణి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

ప్రజాశక్తి - రేపల్లె

ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించిన కమిషనర్ కె. సాంబశివరావు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో హోటల్స్, కిరాణా షాప్ల యజమానులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్‌ను దష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపి వేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏటా భారీ సంఖ్యలో పక్షులు, జీవులు ప్లాస్టిక్ బారిన పడి నశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ నిషేధం కోసం వ్యాపారులు, ఫ్లెక్సీ, ప్రింటింగ్ యజమానులు కూడా పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటేషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు సిమెంట్ బస్తాల వితరణ

ప్రజాశక్తి- అద్దంకి

విశ్వభారతి రోడ్డు లోని హరిహర గోశాలను ఎంఆర్‌ఎఫ్ టైర్స్ వెనుక చిన్ని అంజిబాబు స్థలంలోకి మార్చుతున్నారు. అందులో భాగంగా షెడ్‌లో ఫ్లోరింగ్‌కు అవసరమైన సిమెంట్, కంకర మెటీరియల్‌ను రోటరీ మిత్రులు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు వీరయ్య మాట్లాడుతూ గోశాలకు అవసరమైన ప్రతి సందర్భంలో రోటరీ తరపున సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, పోకూరి శ్రీనివాసరావు, కొల్లా పవన్, గోశాల సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులు సంతోషంగా ఉన్నారు

ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

గత ఐదేళ్ల పాలనలో రివర్స్ టెండరింగ్ వల్లపంట కాలువలు ఎలాంటి మరమ్మతులు. అభివద్ధి జరుగలేదని, టిడిపి అధికారంలోకి వచ్చాక నిధులు కేటాయించటంతో పంటలు బాగా పండి రైతులందరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఎంఎం .కొండయ్య తెలిపారు శాసన సభలో ఎపి బడ్జెట్ సెక్షన్ జీరో అవర్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. గుంటూరు నుంచి ప్రకాశం కు వచ్చే ప్రధాన వాటర్ కెనాల్ పర్చూరు,చీరాల వైపుకు సబ్ కెనాల్ ద్వారా నీరు సరఫరా అవు తుందన్నారు. నీరు వచ్చే క్రమంలో కాలువలు దెబ్బతిన్నట్లు తెలిపారు. కాలువలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మోటుపల్లి వద్ద ఎన్‌టి ఆర్ ప్రారంభించిన పథకం కూడా ఉందన్నారు. దానితో పాటు చీరాల ప్రాం తంలో 5 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు తెలిపారు. వాటికి కూడా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెయిన్ కెనాల్ సమస్యలు పరిష్కార అయితే చీరాల టౌన్, మండలాలకు కూడా దీని ద్వారానే తాగునీరు అందించ్చునని తెలిపారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి -బాపట్ల

బాపట్ల-చీరాల మధ్య బ్రిటిష్ కాలం నుంచి ఉన్న 80 అడుగుల రాజదండు రోడ్డు,చీరాల- సూర్యలంక ఎయిర్ ఫోర్స్ రోడ్డును చీరాల ఓడరేవు వరకూ కలిపితే ఈ ప్రాంత పర్యాటక రంగం అభివద్ధికి మరింత తోడ్పడుతుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేనన నరేంద్ర వర్మ అన్నారు. శాసనసభలో బుధవారం ఆయన మాట్లాడారు. సముద్ర తీరానికి సమాంతరంగా రహదారి ఏర్పాటు చేస్తే 10 నుంచి 12 వరకూ 3 , 4, 5 నక్షత్రాల హోటళ్లు వచ్చే అవ కాశం ఉందన్నారు. ఒక్కొక్క హోటల్‌పై 18శాతం జిఎస్‌టి ద్వారా ఏడాదికి సుమారుగా రూ మూడు కోట్ల వచ్చే అవ కాశం ఉందన్నారు. కేరళ ప్లేస్ నుంచి హౌసింగ్ బోర్డ్స్ , ఫ్యామిలీ బర్డ్స్ పై టిక్కెట్ల ద్వారా వచ్చే ఆదాయంతో ఒక్క బాపట్ల- చీరాల ప్రాంతంలోనే యేడాదికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ100 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్మ

సిఎం పర్యటనను

విజయవంతం చేయాలి

- అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి
- ఏర్పాట్లపై విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ తమీమ్అన్సారియా


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న మార్కాపురం రానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం సిఎం చంద్రబాబు పర్యటనకు కసరత్తు ప్రారంభించింది. సిఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్అన్సారియా బుధవారం మార్కాపురంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌వికెపి కళాశాలలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలన్నారు. ఇక్కడ జరగబోయే మహిళా దినోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమమని చెప్పారు. ముందుగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలసి రాయవరం వద్ద, ఎస్వీకెపి కళాశాల, మార్కెట్ యార్డు, సౌజన్య కన్వెన్షన్ హాల్, తర్లుపాడు రోడ్డులోని శ్రీసాయి బాలాజీ స్కూల్ వద్ద, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బోడపాడు వద్ద తదితర ప్రదేశాల్లో పర్యటించి బహిరంగ సభ, హెలిప్యాడ్ కోసం అనువైన స్థలాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మిప్రసన్న, జడ్‌పి సిఇఓ చిరంజీవి పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘాలు

వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలి

కలెక్టర్ వెంకటమురళి



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మెరుగ్గా వాణిజ్య వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిస్ట్రిక్ట్ కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీల ద్వారా వాణిజ్య కార్యకలాపాలు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సిహెచ్.శ్యాంసన్, వ్యవసాయ శాఖ జెడి రామకష్ణ, పశుసంవర్ధకశాఖ జెడి వేణుగోపాల్, గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సి.ఇ.ఓ ఫణి కుమార్, ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సి.ఇ. ఓ బిందు తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండకు రూ.2 వేలు కేటాయించాలని వినతి


మంత్రికి అర్జీ ఇస్తున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఈ ఏడాది బడ్జెట్లో రూ 2000 కోట్లు కేటాయించాలని ఏపీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరింది. ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు, 11 నిర్వాసిత గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని బుధవారం సాయంత్రం ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జుజ్జూరి జయంతి బాబు, పమిడి వెంకట్రావు విజయవాడలో ఆయనకు వినతి పత్రం అందించారు. మంత్రిని కలిసిన వారిలో డిటి రెడ్డి ఉన్నారు.

సభ్యత్వ నమోదులో 'గ్లోరియా'కు ప్రథమ స్థానం


గ్లోరియాను అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో చేపట్టిన రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో బాపట్ల ఆర్‌డివో పి గ్లోరియా జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. బాపట్ల రెడ్‌క్రాస్‌లో 24 మంది ప్యాట్రన్ సభ్యులను చేర్పించి ఈ మేరకు రూ.6,02,400ను కలెక్టర్ జె వెంకట మురళి చేతుల మీదుగా రెడ్ క్రాస్ ఛైర్మన్ నారాయణ భట్టుకు బుధవారం అందించారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో జిల్లాలో ప్రథమంగా నిలిచిన గ్లోరియాను జిల్లా కలెక్టర్ ఈసందర్భంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టి.ప్రసాద రెడ్డి పాల్గొన్నారు.

ఇది దగాకోరు పరిపాలన

- ఢిల్లీ రైతు ఉద్యమ హామీలకు తిలోదకాలు
- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేపీసీ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

దేశంలోని రైతాంగాన్ని దగా చేసి, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా ప్రధాని మోడీ పరిపాలన సాగిస్తున్నారని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్, రైతుబంధు అవార్డు గ్రహీత చుండూరి రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాడు ఒంగోలు కలెక్టరేట్ ఎదుట సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేపీసీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక పాలనను నిరసిస్తూ ధర్నా చేపట్టారు . ఈ కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా పంటలకు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు సి 2 ప్లస్ 50 శాతం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. కొత్తగా నూతన మార్కెటింగ్ చట్టాలతో వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని ధ్వజమెత్తారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు లక్షల రూపాయలు రుణాలు ఇస్తూ, రుణాలు చెల్లించకపోతే మాఫీలు చేస్తూ లక్షల కోట్లు కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జుజ్జూరి జయంతి బాబు, పమిడి వెంకట్రావు మాట్లాడుతూ గుంటూరు మిర్చి యార్డులో వ్యాపారులు మిర్చిని క్వింటా రూ.13 వేల నుండి రూ.14 వేల వరకు కొనుగోలు చేస్తుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వంచే క్వింటాలు మిర్చి ధర మద్దతు ధర రూ.11,781 ప్రకటించటం ఏంటని ప్రశ్నించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం పట్ల కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వెలిగొండకు కనీసం రూ. 2000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కోడూరి కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనూరి వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్.సాయి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్ డి సర్దార్, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ లలిత కుమారి, పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రాజశేఖర్, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే హనుమంతరావు, అభ్యుదయ రచయిత పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ నెల 10వ తేదీ గుంటూరులో జరిగే సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి ధర్నాను జయప్రదం చేయాలని నిర్ణయించారు.

50 శాతం రాయితీతో

అదనపు లోడు క్రమబద్ధీకరణ

జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఇ ఆంజనేయులు


ఎస్‌ఇ ఆంజనేయులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరణ చేయనున్నట్లు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఇ ఆంజనేయులు తెలిపారు. ఈ అవకాశం ఈనెల 1 నుంచి జూన్ 30 వరకు మాత్రమే అమలుతో ఉంటుందని వినియోగదారులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఒక కిలో వాట్‌కు డెవలప్మెంట్ చార్జీలు ఇంతకుముందు రూ.2000 కాగా ఇప్పుడు 50శాతం రాయితీతో రూ.1000 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. గహ విద్యుత్ వినియోగదారులు తాము వాడుకుంటున్న అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని లేదా గూగుల్‌లో ఎపిసిపిడిసిఎల్ వెబ్ సైట్ లో గాని లేదా విద్యుత్ ఉపకేంద్రంలోని అధికారులు కలిసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మీ అభిమానం మరువలేను..

ఘనంగా దామచర్ల సత్య జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దామచర్ల సత్య


దామచర్ల సత్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి-టంగుటూరు


రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య 42వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఒంగోలులో దామచర్ల సత్యా తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జన్మదిన వేడుకలు భారీగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యా మాట్లాడుతూ మీ అభిమానం మరువలేనని, గుర్తుంచుకుంటానని చెప్పారు. కొండపి అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మొదట జరుగుమల్లి నాయకులు భారీ గజమాలతో సత్యాను సత్కరించారు. కొండపి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు పూల మాలలతో పోటెత్తి సత్యాకి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు, మక్కెన వెంకట రావు, మెలకలపల్లి రామకృష్ణ, వడ్డెళ్ళ మాధవ రావు, ఈదర సుమంత్, నేతి రవికుమార్, బొజ్జా శ్రీను, ఎం.నిడమానూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాకుమాని శ్రీకాంత్, కాకుమాని శ్రీనివాస్, టిడిపి సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకయ్య, ఎం.నిడమానూరు గ్రామ ప్రధాన కార్యదర్శి పేరాబత్తిన రంగారావు, బెజవాడ హరిబాబు, జరుగుమల్లి టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, పిఆర్‌ఏఈ కోటా శ్రీహరి, శ్రీనిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వాయల విజయరత్నం, దామర్ల అనిల్ భారీగా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సత్య జన్మదిన వేడుకలు

పుట్టినరోజు సందర్భంగా దామచర్ల సత్య తన స్వగృహంలో తల్లిదండ్రులు దామచర్ల పూర్ణచంద్రరావు-విజయలక్ష్మి ఆశీర్వాదం, వేద పండితుల అశీర్వచనాలు తీసుకున్నారు. తన కాన్వాయ్‌తో బయలుదేరి శ్రీ వల్లూరమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఈఓ రమేష్ వేద పండితుల ఆశీర్వచనాలతో పూర్ణ కుంభంతో సత్యాకు స్వాగతం పలికారు. వల్లూరమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యవత అధికార ప్రతినిధి రామా గోపి, కారుమంచి టిడిపి సీనియర్ నాయకులు ఈదర ప్రభాకరరావు బోడపాలి అంజిబాబు గజమాలతో సత్యాను సత్కరించారు. దేవాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూర్పునాయుడు పాలెం గ్రామంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి యన్టీ రామారావు, దేవాదాయ శాఖా మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పునాయుడుపాలెం గ్రామ సర్పంచి తల్లనేని రవికుమార్ దామచర్ల సత్యాకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్యాను సత్కరించారు. టంగుటూరులో తప్పెట్లతో టపాసులతో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్యాకు ఘన స్వాగతం లభించింది. మాజీ ఉప ప్రధాని జగజ్జీవనరామ్, మాజీ ముఖ్యమంత్రి యన్‌టి రామారావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పూలే, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి సత్యా నివాళులర్పించారు. తదుపరి జరిగిన సభలో టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, టంగుటూరు టిడిపి అధ్యక్షులు కామని విజయకుమార్, నాగ శ్రీను పలువురు నాయకులు పాల్గొన్నారు. సత్యా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. తదుపరి అంకాల పరమేశ్వరి దేవాలయంలో పూజలు నిర్వహించారు.



సత్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు


ఒంగోలులోని నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో దామచర్ల పూర్ణచంద్రరావు